

ఒప్పంద పత్రాలు చూపిస్తున్న
కోల్ ఇండియా అధికారి, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్

బొగ్గు గనుల్లో హరిత విప్లవం

● పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి ● హార్ట్ ఫుల్‌నెస్ సంస్థతో ఒప్పందం

షాద్‌నగర్ అర్బన్/నందిగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బొగ్గుతీసి నిరుపయోగంగా వదిలేసిన గనుల్లో పచ్చదనాన్ని పెంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో గురువారం బొగ్గు, గనుల శాఖలకు సంబంధించిన సలహా సంఘ సమావేశం జరిగింది. మంత్రి కిషన్‌రెడ్డితో పాటు సహాయ మంత్రి సతీష్‌చంద్ర దుబే, గనులశాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్, పలువురు సీఎండీలు పాల్గొన్నారు. నిరుపయోగంగా ఉన్న బొగ్గు గనుల్లో పచ్చదనాన్ని పెంపొందించి, పర్యాటక కేంద్రాలుగా వృద్ధి చేయడానికి శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నుంచి సాంకేతిక విజ్ఞానాన్ని, సలహాలను తీసుకోవాలని నిర్ణయించారు. మంత్రుల సమక్షంలో కోల్ ఇండియా, సింగరేణి సంస్థలతో రాంచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. కోల్ ఇండియా లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ అచ్యుత్ ఘటక్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్‌తో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి, మార్చుకున్నారు.



ఆపరేషన్ ముస్కాన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా

ఆపరేషన్ ముస్కాన్ సాగాలి

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా ఆపరేషన్ ముస్కాన్ సాగాలని కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆపరేషన్ ముస్కాన్(11)పై సమీక్ష ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలతో కలెక్టర్ చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో అనాథ పిల్లలను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. పని ప్రాంతాలు, బస్టాండ్లలో గుర్తించిన వారి వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ శైలజ, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జాసన్, డీఈఓ రోహిణి, డీసీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ సమీక్షలో కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్‌పై కేంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అరుంధతి పట్నాయక్ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ హరిచందన దాసరి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో 29 వేల స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మొబైల్ ఎక్స్‌రే మిషన్లు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

వాట్సా‌ప్‌లో ఆస్తి పన్ను చెల్లింపు!

● అధునాతన సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్న జీహెచ్ఎంసీ

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపునకు సాంకేతిక సేవల వినియోగ విస్తృతి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. వాట్సాప్ ద్వారా బిల్లు చెల్లించే సేవలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేపట్టింది. సాంకేతిక సంస్థల నుంచి ప్రతిపాదనల కోసం ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ(ఈఓఐ) నోటిఫికేషన్ ప్రకటించింది. వాట్సాప్‌లో బిజినెస్ అకౌంట్ ఓపెన్ చేయడం ద్వారా ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముతోపాటు సంస్థకు రావాల్సిన ఇతరత్రా ఆదాయాల వసూలుకు శ్రీకారం చుట్టనున్నారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్/డెబిట్ కార్డులు, యూపీఐ ద్వారా పన్ను చెల్లించవచ్చని ఓ అధికారి తెలిపారు.


వడ్ల విత్తనాలు తీసుకొని డబ్బులు ఇవ్వడం లేదని

'నూజివీడు సీడ్స్' ఎదుట రైతుల ఆందోళన

పేట్‌బషీరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వడ్ల విత్తనాలు తీసుకొని డబ్బులు ఇవ్వడం లేదని సీడ్స్ పరిశ్రమ ఎదుట రైతులు గురువారం ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండల్ గెరిల్ల తండాకు చెందిన 150మంది రైతులు డీసీఎం, కార్లలో తరలివచ్చి కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నూజివీడు సీడ్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు రూ. 1.50 కోట్లు రావాలని, పండించిన పంటకు డబ్బులు ఇవ్వకపోవడంతో ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. సోమవారం డబ్బులు ఇస్తామని నూజివీడు సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ హరిప్రసాద్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు.

డాక్టర్ల కోసం క్లినిక్ టు కెమెరా పేరిట బూట్ క్యాంప్

● ఆగస్ట్, సెప్టెంబరులో నిర్వహణ



మణి పవిత్ర

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అర్హత, నైపుణ్యంగల డాక్టర్లు ఆన్‌లైన్‌లో సమాచారం పంచుకోవడానికి ముందుకొస్తే అసత్య వార్తలను అడ్డుకోవచ్చన్నారు క్రియేటివ్ వెర్స్ స్టూడియో అధినేత్రి డాక్టర్ మణి పవిత్ర. క్లినిక్ టు కెమెరా అంటూ ఇటీవల తాము నిర్వహించిన బూట్ క్యాంప్‌నకు అపూర్వ స్పందన లభించిందని, అదే తరహా బూట్ క్యాంప్‌లను ఆగస్ట్, సెప్టెంబరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంప్‌లకు కొంతమంది డాక్టర్లు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్‌లో అర్హత గల డాక్టర్లు కనిపించాల్సిన ఆవశ్యకతను వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం చాలా మంది ఆరోగ్య సమాచారం రీల్స్ ద్వారా పొందుతున్నారు. యూట్యూబ్ వీడియోలలో చూసినదే అసలైన సమాచారమనుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో డాక్టర్లు నిశ్శబ్దంగా ఉండటం ఎంతమేరకు సబబు అని ప్రశ్నించారామె.

రియల్ ఎస్టేట్ పేరుతో భారీ మోసం

(5వ పేజీ తరువాయి)

వసూలు చేశారు. ఈ మొత్తానికి ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులు, ఎంఓయూలు ఇచ్చారు. వీరికి కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లింపులు చేశారు. ఆ తరువాత పరారయ్యారు. మోసపోయామని గుర్తించిన బాధితులు బాచుపల్లి, కొల్లూరు, చందానగర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బెంగళూరులో మహేష్‌ను, నెల్లూరులోని కందుకూరులో ఉజ్వలను అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు. అయితే, షైన్ సొల్యూషన్స్, వెస్ట్రన్ ఆక్వా పేరుతో మహేష్ మరో రెండు కంపెనీలను కూడా ఏర్పాటు చేశాడని తమ విచారణలో గుర్తించినట్లు ఆయన తెలిపారు. కేసును ఆర్థిక నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ కె.వి.సుబ్బారావు బృందం దర్యాప్తు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించి.. రహదారి విస్తరించండి

- అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశం
- అత్యవసరంగా నాలుగు స్తంభాలు తొలగించాలని సూచన



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ముందుగా విద్యుత్ స్తంభాలు, చెట్లు తొలగించి ఆ తర్వాత రోడ్డు పనులు మొదలుపెట్టాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. స్తంభాలు, చెట్లు తొలగించకుండా రోడ్డును ఎలా విస్తరిస్తారని ఆమె ప్రశ్నించారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రజాధనం సైతం వృథా అవుతున్నదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో నాదర్‌గుల్, కుర్మల్‌గూడ గ్రామాల అభివృద్ధి పనులపై వివిధ విభాగాలకు చెందిన అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ నాదర్‌గుల్ బస్టాండ్ వద్ద ఇటీవల సీసీ రోడ్డు అభివృద్ధి చేశారని, దానికి అనుబంధంగా గ్రీన్‌హోమ్స్ కాలనీ వరకు కూడా సీసీగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా రానున్న బోనాల పండుగ నేపథ్యంలో అక్కడ రోడ్డు పక్కన ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలను అత్యవసరంగా తొలగించి విస్తరణ పనులకు ఆటంకం కలుగకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. అనంతరం గాంధీనగర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు గల విద్యుత్ స్తంభాలను తొలగించాలని, దీనికి సంబంధించిన అంచనాలు తయారు చేసి ట్రాన్స్‌కో అధికారులకు పంపించాలని ఆమె మునిసిపల్ అధికారులకు సూచించారు. అదేవిధంగా రోడ్డుకిరువైపులా గల చెట్లను సైతం తొలగించడానికి చర్యలు తీసుకోవాలని, ఆయా పనులు పూర్తయ్యాక రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఆలోగా రోడ్డు మధ్యలో సింగిల్ మెయిడిన్(డివైడర్) నిర్మాణం మొదలుపెట్టాలని, తద్వారా వాహనాలు ఒకే వరుసలో వెళ్లడానికి అనువుగా ఉంటుందని సబిత సూచించారు. విస్తరణలో భాగంగా రోడ్డుకు రెండు పక్కలా వరదనీటి కాలువలు సైతం నిర్మించాలని సూచించారు.

త్వరలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి కృష్ణానీరు సరఫరా

కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి త్వరలోనే కృష్ణానీరు సరఫరా జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి చెప్పారు. ఇటీవల కొందరు నాయకులు రెండ్రోజులు కృష్ణానీరు సరఫరా చేయించి, పాలాభిషేకాలు సైతం నిర్వహించుకున్నారని, ఆ తర్వాత నీటి సరఫరా ఆగిపోయిందని ఆమె విమర్శించారు. తాను స్వయంగా వాటర్‌వర్క్ ఉన్నతాధికారులతో మాట్లాడానని, త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్టు అధికారులు పేర్కొన్నారని ఆమె తెలిపారు. ఇక్కడ పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకుంటానని, చిల్డ్రన్స్‌పార్క్ సైతం ఏర్పాటు చేయిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చర్యలు

హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు



పార్కు స్థలం వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు

వనస్థలిపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): పార్కు స్థలాన్ని కబ్జాచేయడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సర్వేనం.130లోని బృందావన్ మెడోస్ కాలనీకి చెందిన 232 గజాల పార్కు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జాచేసి షెడ్డు నిర్మాణం చేయడంతో తమ కాలనీలో పార్కు లేకుండా పోయిందని, తమ లేఅవుట్‌లో ఉన్న పార్కు స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు సదరు హైడ్రా ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ కాలనీవాసులతో కలిసి కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు పొనుగుపాటి శశికాంత్ మాట్లాడుతూ ఈ పార్కు స్థలం విషయాన్ని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లతో పాటు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఈ స్థలం పార్కుకు చెందినదని అధికారులు బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ఈ స్థలంపై కన్నేసిన సదరు భూ కబ్జాదారులు అధికారులు ఏర్పాటు చేసిన పార్కు బోర్డును మరుసటి రోజు తొలగించి, రాత్రికి రాత్రే అక్కడ షెడ్డు నిర్మాణం చేశారన్నారు. తమ కాలనీ లేఅవుట్‌లో ఉన్న పార్కు స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించి పార్కుగా తీర్చిదిద్దాలని హైడ్రా అధికారులను కోరారు. అనంతరం హైడ్రా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పార్కు స్థలాలను, ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అరుణ్, శివశంకర్, రమేష్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గాజీకి నివాళులర్పిస్తున్న మంత్రి వాకాటి శ్రీహరి

పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుర్గాజీ కన్నుమూత

సైదాబాద్: పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. దుర్గాజీ(61) అనారోగ్యంతో బుధవారం ఆస్పత్రిలో కన్నుమూశారు. సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముండే దుర్గాజీ నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్‌జడ్జి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కమ్ జాయింట్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదంలో గాయపడి కొంత కాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన పార్థివ దేహాన్ని మంత్రి వాకాటి శ్రీహరి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు.

హార్పిక్ తాగి వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్: మద్యం మైకంలో హార్పిక్ తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరేష్ కథనం ప్రకారం.. గడ్డిఅన్నారంలోని పోచమ్మబస్తీకి చెందిన షబ్బీర్(35) రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. కాగా, మద్యానికి బానిసైన షబ్బీర్ జూన్ 30న మైకంలో ఇంటిలోని హార్పిక్ తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మన్సూరాబాద్ : నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధి పసుమాముల గ్రామ శివారులో హత్య జరిగిన ఘటనలో నిందితులుగా ఉన్న మృతుడి పెద్దకుమారుడు, భార్యలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూన్30న రాత్రి అశోక్ మహతొ (40) అనే వ్యక్తి హత్యకు గురైన విషయం విదితమే. మృతుడి భార్య క్రాంతిదేవి, పెద్ద కుమారుడు రాజేందర్‌కుమార్‌పై అనుమానం వ్యక్తం చేసి బుధవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో గురువారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్, ఎస్ఐ పి.శివనాగప్రసాద్‌లతో పాటు సిబ్బందిని ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య అభినందించారు.

నెక్స్ట్ గలేరియా మాల్‌లో ఫైర్ మాక్‌డ్రిల్



అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి వెంకన్న

సంతోష్‌నగర్ : అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు స్పందన సహాయసహకారాలు ఎలా ఉండాలనే అంశంపై మూసారాంబాగ్‌లోని నెక్స్ట్ గలేరియా మాల్‌లో హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి టి.వెంకన్న ఆధ్వర్యంలో అగ్నిమాపక మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, వైద్యఆరోగ్యశాఖ మెడికల్ టీమ్ 108సిబ్బంది మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితిలో భవనంలో పని చేస్తున్న ఉద్యోగులను, ప్రజలను ఎలా సురక్షితంగా రక్షించి ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో చూపించడమే ప్రధాన లక్ష్యంగా మాక్ డ్రిల్ కొనసాగింది. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం, అగ్నిమాపక భద్రత పరికరాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవాలని ప్రజలకు, సిబ్బందికి సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పొగ వల్ల శ్వాస తీసుకోనేందుకు ఇబ్బంది అవుతుందని ప్రజలు వంగి లేదా నేల మీద పాకుతూ ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. ప్రతి గురువారం మాల్స్, థియేటర్స్‌లో మాక్‌డ్రిల్‌ని నిర్వహిస్తామని అగ్నిమాపక అధికారి తెలిపారు. మాక్‌డ్రిల్‌లో మలక్‌పేట, సాలార్జంగ్ ఫైర్ ఆఫీసర్స్ మహ్మద్ షౌకత్, మీర్జా కర్మతుల్లాబేగ్, 108 సిబ్బంది అహ్మద్ మతీన్, నర్సింగ్, రవి, ఇమామ్ పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగిపై దాడిని ఖండిస్తూ నిరసన



మలక్‌పేట మార్కెట్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌పై మార్కెట్ వైస్‌చైర్మన్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి మార్కెట్ కార్యాయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా టీఎన్‌జీఓ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రంలు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలకు డ్రెస్‌కోడ్ దుస్తుల పంపిణీ విషయంలో తలెత్తిన వివాదంలో మార్కెట్ కార్యదర్శిపై వైస్‌చైర్మన్ దాడి చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్కెట్ కమిటీ ఉద్యోగులు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో లైసెన్స్ ఉన్న హమాలీలకు మాత్రమే దుస్తులు పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిబంధన మేరకు కార్యదర్శి దుస్తులు పంపిణీ చేస్తుండగా అందుకు విరుద్ధంగా లైసెన్స్ లేనివారికి సైతం ఇవ్వాలని వైస్‌చైర్మన్ కార్యదర్శిపై దాడిచేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. తక్షణమే వైస్‌చైర్మన్‌ను పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్కెట్ ఉద్యోగులు ఆందోళన చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ ఉద్యోగులు పుష్ప మాధురి, రేవంత్, సంతోష్, సాయినాథ్‌రెడ్డి, పవన్, ఖలీద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకం

● డిప్యూటీ కమిషనర్ మంగతాయారు



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న అధికారులు

సైదాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా నవీకరణ, సవరణలో బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వో) పాత్ర కీలకమని జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు అన్నారు. గురువారం వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఓటరు జాబితా రూపకల్పనపై జాతీయ బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ ప్రారంభించారు. బీఎల్‌వో యాప్, ఎలాంటి పొరపాట్లులేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఇంటింటికీ తిరిగి పూర్తి వివరాలు, ఆధారాలు సేకరించాలని సూచించారు. నూతనంగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపై బీఎల్‌వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 6,7,8 ఫాంలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు సురేందర్‌గౌడ్, మహ్మద్ వసీపుద్దీన్, రత్నమ్మ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి : సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ రాకతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ చిలకలబస్తీకి చెందిన నిఖిత కొన్ని రోజుల నుంచి కీళ్ల నొప్పులకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స కోసం ఆర్థిక పరిస్థితులు బాగలేక ఇటీవల ఆమె ఎమ్మెల్యేను సంప్రదించారు. ఆపరేషన్‌కు కావలిసిన డబ్బుల కోసం ఎమ్మెల్యే సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం నిఖితతో దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరు కావడంతో గురువారం ఎమ్మెల్యే బాధితురాలి తండ్రి రాముకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దచెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ఓపెన్‌జిమ్ ప్రారంభం

మన్సూరాబాద్, జులై 3(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతీ కాలనీలోని పార్కులు, సంక్షేమ సంఘం భవనాల వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని పెద్దచెరువు ప్రాంగణంలో రూ.8లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో యోగా గురువు భరత్‌భూషణ్, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు భూపాల్ రెడ్డి, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, చంద్రశేఖర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

20న పోచమ్మఆలయంలో బోనాలు

మన్సూరాబాద్, జులై 3(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 20న మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల విఠల్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగలో భాగంగా పోచమ్మ తల్లికి 13న శాకంబరీ అలంకరణ, 18న శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, 20న పెద్దఎత్తున బోనాల సమర్పణ ఉంటుందన్నారు. సమావేశంలో దుర్గాదేవి ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, సత్యనారాయణ, యాదయ్య, నాంపల్లి శంకరయ్య, శ్రీరాములు, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, ఈశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ గురువారం జిల్లా కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. పేదలు గుడిసెలు వేసుకుని 40ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు సొసైటీల పేరుతో ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సత్వరమే గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానా

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ సంచుల తయారీ కేంద్రాలు, దుకాణాలపై పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా 125 మైక్రాన్లకు తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వివిధ దుకాణదారుల నుంచి రూ.15వేల జరిమానాలను వసూలు చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ అధికారులు దశరథ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు'

కొత్తపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ ఎల్బీనగర్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి అన్నారు. గురువారం న్యూనాగోల్‌లోని ప్రజాసంఘాల భవనం ఎస్ఏ డాంగే భవన్‌లో ఎల్బీనగర్ జోన్ మునిసిపల్ కార్మికుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్‌లలోనూ అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రెండేళ్లు గడుస్తున్నా పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు ఇవ్వలేదని, వర్షాల వేళ కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే కార్మికులకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మహిళా ప్రతినిధులు లక్ష్మి, లక్ష్మమ్మ, అండాలు, ఇందిరమ్మ, మంజుల పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య కోరారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ చౌరస్తాలో గురువారం పారిశుధ్య కార్మికులతో కలిసి ఎల్లయ్య సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్మికులందరని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9న కార్మికులందరు సాగర్‌రింగ్‌రోడ్‌కు పెద్దసంఖ్యలో చేరుకొని సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, కార్మికులు ఎల్లమ్మ, పద్మ, యాదమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, పొన్నమ్మ, సువర్ణ, మల్లయ్య, సురేష్, యాదమ్మ, కళావతి పాల్గొన్నారు.

మన్సూరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న చేపట్టదలచిన కార్మిక సమ్మెకు సహకరించాలని వివిధ కంపెనీల యాజమాన్యాలను, కార్మికులను సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కేసరి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని వివిధ కంపెనీల యాజమాన్యాలను, అందులో పనిచేసే కార్మికులను గురువారం కలిసి వినతిపత్రాలు, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.